నేడు మేడిగడ్డకు బీఆర్ఎస్ బృందం

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. అందులో భాగంగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం శుక్రవారం మేడిగడ్డను సందర్శించనుంది. పార్టీ ఎమ్మెల్యేలు, శాసనమండలి, పార్లమెంట్ సభ్యులు, ఇతర ముఖ్య నాయకులతో కూడిన బృందం ఉదయం తెలంగాణ భవన్ నుంచి బయలుదేరుతుంది. దాదాపు 200 మందితో కూడిన ఈ బృందం తమ వెంట మీడియాను, నిపుణులను కూడా తీసుకెళ్లి మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లను పరిశీలిస్తుంది. కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బరాజ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో దానిని తిప్పికొట్టడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ఈ పర్యటన చేపట్టింది.

మేడిగడ్డకు పోటీగా కాంగ్రెస్ 'పాలమూరు' యాత్ర

పాల్గొననున్న ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల ఎమ్మెల్యేలు

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేపట్టనున్న మేడిగడ్డ బరాజ్ యాత్రకు పోటీగా శుక్రవారం కాంగ్రెస్ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సందర్శన యాత్రకు పిలుపునిచ్చింది. ఈ యాత్రలో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొంటారని ఏఐసీసీ కార్యదర్శి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో గురువారం ఆయా జిల్లాల ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కృష్ణా పరీవాహక ప్రాంత ప్రాజెక్టులను కేఆర్ఎంబీ (కృష్ణా రివర్ మేనేజిమెంట్ బోర్డు)కి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ నల్లగొండలో బీఆర్ఎస్ భారీ బహిరంగసభ నిర్వహించగా, అదే రోజు పోటీగా రాష్ట్రప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లిన విషయం తెలిసిందే. తాజాగా బీఆర్ఎస్ చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు యాత్రకు పోటీగా పాలమూరు ప్రాజెక్టు సందర్శనకు పాలకపక్షం పిలుపునిచ్చింది. అయితే ఈ యాత్రకు సీఎం రేవంత్‌రెడ్డి వెళ్తారా? లేదా? అన్న విషయం గోప్యంగా ఉన్నది.

ఆర్టీసీలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

నేరుగా ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ తార్నాకలో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలో ఉన్న పలు ఖాళీల భర్తీకి ఆర్టీసీ తాజాగా మరో నోటిఫికేషన్ జారీచేసింది. ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో ప్రొఫెసర్ 1, అసిస్టెంట్ ప్రొఫెసర్ 3, ట్యూటర్ 2 ఖాళీలు ఉన్నాయి. ఎమ్మెస్సీ నర్సింగ్ చేసి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తారు. ఎంపికైన అభ్యర్థులకు పోస్టుల ఆధారంగా నెలకు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం చెల్లిస్తారు. నేరుగా ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



భూపాలపల్లి కలెక్టరేట్ ఏవో మహేశ్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు



పెద్దపల్లి కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న మంథని నియోజకవర్గ రైతులు

కాళేశ్వరం నీటికోసం రైతుల ఆందోళన

పెద్దపల్లిలో కలెక్టరేట్ ఎదుట నిరసన • భూపాలపల్లిలో కలెక్టరేట్‌లో వినతిపత్రం

మేడిగడ్డకు మరమ్మతులు చేయాలని.. పంట పొలాలకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్

పెద్దపల్లి/భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 29: మేడిగడ్డ బరాజ్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లలో నీటిని నిల్వ ఉంచి సాగుకు అందజేయాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం పెద్దపల్లిలోని కలెక్టరేట్ ఎదుట మంథని నియోజకవర్గ రైతులు ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తలాపునే గోదావరి పారుతున్నా వాడుకోలేక ఉమ్మడి రాష్ట్రంలో అనేక ఇబ్బందులు పడ్డామని తెలిపారు. గోదావరి, ప్రాణహిత నీళ్లు ఆంధ్రా ప్రాంతానికి తరలిపోయి వృథాగా సముద్రంలో కలిసిపోతున్నా పట్టించుకునేవారే లేరని, ఫలితంగా సాగునీటికి అనేక ఇబ్బందులు పడ్డామని గుర్తుచేశారు. గోదావరి నీటికి అడ్డుకట్ట వేసి సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించినట్టు చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నిర్మించి వాటి ద్వారా ఎల్లంపల్లి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసి సాగునీటిని విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గోదావరి నదిమీద బరాజ్‌ల నిర్మాణంతో ఎప్పుడూ నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల కింద సాగు విస్తీర్ణం పెరిగిపోయిందని చెప్పారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ బరాజ్‌లోని రెండు పిల్లర్లు కుంగిపోయాయనే సాకుగా చూపించి మరమ్మతులు చేయకపోవడం సరికాదని అన్నారు. గత ప్రభుత్వంపై అనేక ఆరోపణలు చేస్తూ ప్రాజెక్టును ఎండబెట్టడం వల్ల సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ప్రాజెక్టు నిర్మించిన తర్వాత గత ఐదేండ్లుగా సాగునీటికి ఎలాంటి సమస్య రాలేదని అన్నారు. ఇప్పటికైనా స్పందించి బరాజ్‌కు వెంటనే మరమ్మతులు చేయించి రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్నదని సూచించారు.

భూపాలపల్లి కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం

కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు జరిగిన ప్రమాదాన్ని అధికార కాంగ్రెస్ పార్టీ తప్పుగా చూపిస్తూ కాలయాపన చేయకుండా వెంటనే కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోసి పొలాలకు అందించాలని భూపాలపల్లి మండలంలోని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు గురువారం వారు జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయ ఏవో మహేశ్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కరువు పీడితులమై దుఃఖించిన తమ ప్రాంతానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక కల్పతరువుగా మారిందని అన్నారు. బీడు భూములన్నీ కొంతకాలంగా కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలంగా మారాయని పేర్కొన్నారు. కానీ ఇటీవల దురదృష్టవశాత్తు మేడిగడ్డ బరాజ్‌లోని మూడు పిల్లర్లకు పగుళ్లు రావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ దానిని తప్పుగా చూపిస్తూ కాలయాపన చేస్తున్నందున పంటలకు నీరందక ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పిల్లర్లకు మరమ్మతులు చేపట్టి కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయాలని వారు కోరారు.

కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చీమలకుంటపల్లిలో ఎండుతున్న మక్కను పరిశీలిస్తున్న వినోద్

పంటలను ఎండబెడతారా?

- ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకోవద్దు
- పంటలు ఎండకముందే నీరందించాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్
- చీమలకుంటపల్లిలో పంటల పరిశీలన

గన్నేరువరం, ఫిబ్రవరి 29: మేడిగడ్డ బరాజ్ పిల్లర్లు కుంగిపోయాయనే సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం పంటను ఎండబెట్టే ప్రయత్నం చేస్తుందని కరీంనగర్ మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ ఆరోపించారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చీమలకుంటపల్లిలో నీరందక ఎండిపోతున్న పంట పొలాలను, నీళ్లు లేక నెర్రెలు బారిన చెరువు, సాగునీటి కాల్వను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ మేడిగడ్డ దగ్గర గోదావరి నదిలో ప్రస్తుతం రోజూ 5 వేల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలోకి పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. మేడిగడ్డ దగ్గర కాఫర్ డ్యాం నిర్మించి వెంటనే నీళ్లను అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోసి, అక్కడి నుంచి మిడ్ మానేరులోకి నీళ్లు ఎత్తిపోయడంతోపాటు కాలువల ద్వారా యాసంగి పంటలకు నీరందించాలని సూచించారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు కండ్లముందే ఎండిపోతుంటే రైతులు రోదిస్తున్నారని, ప్రభుత్వం స్పందించి సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడు సాగునీరు ఇచ్చామని, కాంగ్రెస్ అసమర్థత కారణంగా చెరువులు ఎండిపోవడంతోపాటు పంటలు మాడిపోతున్నాయని ఆవేదన చెందారు. పంటలు కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రాజన్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్‌పర్సన్ సిద్ధం వేణు తదితరులు ఉన్నారు.

కాళేశ్వరం ఇంజినీర్‌ను ఉరితీయాలి

3 నెలల కిందటే కేటీఆర్ మేడిగడ్డను సందర్శించాల్సింది: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వెల్లడి

జగిత్యాల, ఫిబ్రవరి 29: కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ చేసిన ఇంజినీర్‌ను ఉరితీయాలని కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కేటీఆర్ మేడిగడ్డ సందర్శనకు వెళ్తుండటంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టులు నెర్రెలు బారినప్పుడే కేటీఆర్ మేడిగడ్డను సందర్శిస్తే బాగుండేదని సూచించారు. ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేకుండా డిజైన్ చేయడం, నిర్వహణ లోపం వల్లనే కాళేశ్వరం ప్రాజెక్టు ఇలా తయారైందని, అసలు కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారి ఎవరో వాడిని ఉరితీయాలని సంచలన వ్యాఖ్యలు చేశారు. సర్పంచ్ ఎన్నికలు ఎందుకు నిర్వహించడం లేదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రశ్నించడంపై జీవన్‌రెడ్డి స్పందించారు. సర్పంచ్ ఎన్నికలు మే లేదా జూన్ నెలలో తమ ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలోనే సర్పంచ్ ఎన్నికలను వాయిదా వేశాం తప్ప.. వేరే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, విజయలక్ష్మి, బండ శంకర్, దుర్గయ్య, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'మేడిగడ్డ'పై ఎన్‌డీఎస్‌ఏ కమిటీ

- కమిటీకి చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వం
- ఆమోదించిన కేంద్ర జల్‌శక్తిశాఖ
- వారంలోగా ప్రాజెక్టు సందర్శన

హైదరాబాద్, ఫిబ్రవరి29 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ కుంగిన ఘటనపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఆమోదం తెలిపినట్టు సమాచారం. మేడిగడ్డ బరాజ్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి లోపాలను గుర్తించడంతోపాటు, చేపట్టాల్సిన పునరుద్ధరణ పనులకు సంబంధించి తగిన సిఫార్సులు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల కేంద్ర జల్‌శక్తిశాఖను కోరింది. ఈ నేపథ్యంలో ఎన్‌డీఎస్‌ఏ తాజాగా చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో కమిటీ వేసింది. కమిటీలోని మిగతా సాంకేతిక నిపుణుల పేర్లను శుక్రవారం వెల్లడించే అవకాశముంది. ఈ కమిటీ వారం రోజుల్లోగా అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బరాజ్‌లను సందర్శించడంతోపాటు ఆయా నివేదికలను పరిశీలిస్తుంది. తదుపరి చేపట్టాల్సిన చర్యలపై నెల రోజుల్లోగా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేయాలని కమిటీకి కేంద్రం నిర్దేశించినట్టు సమాచారం.

మేడిగడ్డలో నత్తనడకన మరమ్మతులు

మహదేవపూర్, ఫిబ్రవరి 29: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌లో మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో కుంగిన 19, 20, 21వ పియర్లతోపాటు ఇతర బ్లాక్‌లలో పేరుకున్న ఇసుక, మట్టిని ఎల్‌అండ్‌టీ సంస్థ కార్మికులు యంత్రాల సహాయంతో తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారు. బరాజ్ అప్‌స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్‌లో కరకట్ట నిర్మాణ పనుల కోసం మట్టిని తరలించి బరాజ్‌కు సమాంతరంగా మట్టి కరకట్ట వేస్తున్నారు. కుంగిన పియర్ల చుట్టూ నీరు ఉండటంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ శుక్రవారం 'చలో మేడిగడ్డ' నేపథ్యంలో అధికారులు తూతూ మంత్రంగా పనులు నిర్వహిస్తున్నారు.

రోడ్డెక్కిన సోయా రైతులు

కొనుగోళ్లు చేపట్టాలని రాస్తారోకో • గంటపాటు నిలిచిన వాహనాలు

జైనథ్, ఫిబ్రవరి 29: సోయా పంట కొనుగోళ్లను నిలిపివేయడాన్ని నిరసిస్తూ గురువారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర రహదారిపై రైతులు, బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. గంటపాటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలుపడ్డారు. మాజీ ఎంపీపీ, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ లింగారెడ్డి మాట్లాడుతూ.. జైనథ్, బేల, ఆదిలాబాద్ మార్కెట్ యార్డుల్లో మార్క్‌ఫెడ్ సోయాను ఒకరోజు కొనుగోళ్లు చేసి ఆ తరువాత నిలిపివేసిందని మండిపడ్డారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందన్న నమ్మకంతో రైతులు సోయా నిల్వలను తీసుకొచ్చి పడరాని పాట్లు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. మరో వారంలో సోయా, శనగ ఉత్పత్తులను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మనోహర్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం ప్రహ్లాద్, గిమ్మ ఎంపీటీసీ కోల భోజన్న, అకోలి సర్పంచ్ కేశవ్, జైనథ్ మార్కెట్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నుంచి ఏపీకి 3 టీఎంసీలు

హైదరాబాద్, ఫిబ్రవరి29 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ నుంచి ఏపీకి 3 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) ఉత్తర్వులు జారీచేసింది. మార్చి నెలకు సంబంధించి సాగర్ కుడి కాలువ ద్వారా 3 టీఎంసీలు, ఏప్రిల్ నెలకు సంబంధించి 5 టీఎంసీలను విడుదల చేయాలని ఏపీ ఇప్పటికే బోర్డుకు లేఖ రాసింది. తాజాగా అందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సారి నీటి విడుదలకు ఇద్దరు బోర్డు అధికారులను కూడా ప్రత్యేకంగా నియమించింది. వారు శుక్రవారం సాగర్ వద్దకు వెళ్లి ఇరు రాష్ట్రాల అధికారుల సమక్షంలో కుడి కాలువ హెడ్‌రెగ్యులేటరీ ద్వారా ఏపీకి 3 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. నీటి విడుదల గేజ్‌లను నమోదు చేయనున్నారు. నిర్ణీత మొత్తంలో నీరు ఏపీకి చేరిన వెంటనే తిరిగి అధికారుల సమక్షంలోనే కుడికాలువ హెడ్‌రెగ్యులేటరీని బంద్ చేయనున్నారు.

చెరువు ఎండి చేనులోకి చేరిన మొసలి

త్రిపురారం/హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లా త్రిపురారంలోని పంట చేనులో గురువారం ఉదయం స్థానిక రైతు కోడి పెద్దులు వరి చేనులో మొసలి కనిపించింది. మిర్యాలగూడ రేంజ్ ఆఫీసర్ ఆనంద్‌రెడ్డి తన బృందంతో అక్కడికి చేరుకొని మొసలిని తాళ్లతో బంధించి తీసుకెళ్లి నాగార్జునసాగర్ జలాశయంలో వదిలిపెట్టారు. చెరువులో మొసలి ఉందని ఏడాది కాలంగా చెప్తున్నా ఎవరూ పట్టించుకోలేదని, ప్రస్తుతం చెరువు ఎండిపోవడంతో పంట పొలాల్లోకి చేరిందని రైతులు తెలిపారు.

లోకం పోకడ

ఈ సబ్సిడీ గ్యాసుకు ఎసరు పెట్టుకుంటే అయేటట్టులేదు వదినా.. ఎండలో ఓ అరగంట నిలబడితే అన్నం ఉడికిపోతున్నది!

తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు అధికం

హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (హైదరాబాద్): తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత పెరుగుతున్నదని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. ఉభయ రాష్ట్రాల్లో సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వెల్లడించారు. ఏపీలోని పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 33 డిగ్రీలుగా నమోదయ్యింది. రాత్రివేళ ఈ ఉష్ణోగ్రతలు 22 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉన్నది. ఇటు తెలంగాణలో ఎండలు రోజురోజుకూ ముదురుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు దాదాపు 4 డిగ్రీల మేర పెరిగి, 32 నుంచి 37 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయని పేర్కొన్నది. రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలుగా నమోదవుతున్నాయని తెలిపింది.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	15.8°c	38.0°c
మెదక్	17.0°c	36.3°c
ఆదిలాబాద్	18.7°c	37.9°c
హైదరాబాద్	20.8°c	33.5°c
ఖమ్మం	21.0°c	36.0°c
మహబూబ్‌నగర్	22.0°c	36.6°c
నిజామాబాద్	22.3°c	36.2°c
వరంగల్	23.0°c	34.0°c
కరీంనగర్	23.0°c	34.0°c
నల్లగొండ	23.8°c	36.9°c

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్‌లో...

రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్), బెంగళూరు కాంప్లెక్స్ తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 517
- **పోస్టులు:** ట్రైనీ ఇంజినీర్
- **జోన్లవారీగా ఖాళీలు:** సెంట్రల్-68, ఈస్ట్-86, వెస్ట్-139, నార్త్-78, నార్త్ ఈస్ట్-15, సౌత్-131
- **గరిష్ఠ వయోపరిమితి:** బీఈ/బీటెక్ అభ్యర్థులకు 28, ఎంఈ/ఎంటెక్ అభ్యర్థులకు 30 ఏళ్లు మించకూడదు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరి తేదీ:** మార్చి 13
- **వెబ్‌సైట్:** www.bel-india.in/careers/

నీలిట్‌లో...

మహారాష్ట్ర ఔరంగాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 3
- **పోస్టులు:** జూనియర్ రీసెర్చ్ ఫెలో
- **అర్హతలు:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు గేట్/నెట్ స్కోరు సాధించి ఉండాలి.
- **వయోపరిమితి:** 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు మినహాయింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.37,000- రూ.42,000
- **దరఖాస్తు:** ఎంప్లాయిమెంట్ మ్యాగజైన్‌లో ప్రచురితమైన తేదీ నుంచి 30 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** https://nielit.gov.in/aurangabad/recruitments

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- సామాజిక నిర్మితి (గ్రూప్స్), ఇంటర్ అర్థశాస్త్రం మోడల్ పేపర్స్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

FORM-IV

STATEMENT OF OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT **NAMASTE TELANGANA**

1. Place of Publication : **HYDERABAD**
2. Periodicity of its Publication : Daily
3. Printer's name : **DAMODAR RAO DIVAKONDA**
   Nationality : Indian
   Address : Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Medchal-Malkajigiri District - 500 078. Telangana State.
4. Publisher's Name : **DAMODAR RAO DIVAKONDA**
   Nationality : Indian
   Address : Telangana Publications Pvt. Ltd, 8-2-603/1/7,8,9, Krishnapuram, Rd.No.10, Banjara Hills, Hyderabad - 500 034. Telangana State.
5. Editor's Name : **THIGULLA KRISHNA MURTHY**
   Nationality : Indian
   Address : 29 - 1405/207A, West Deendayal Nagar, Neredmet, Near Nagendra School, Malkajigiri, Hyderabad. Telangana State.
6. Name and addresses of the individuals who own the Newspaper and partners or Shareholders holding more than one percent of the total Capital : Sri **D. Damodar Rao** Flat No. 4B, Indra Prastha, Rajbhavan Road, Somajiguda, Hyderabad - 500 082. Telangana State.
   Sri **K. Chandra Shekhar Rao** H.No. 8-2-220/110/1/3, Road No.14, Nandi Nagar, Banjara Hills, Hyderabad - 500 034. Telangana State.
   M/s **PACT BROKERAGE LIMITED** Plot No. 213, 3rd Floor, Road No.1, Film Nagar, Hyderabad - 500 096. Telangana State.

I, Damodar Rao Divakonda, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
DAMODAR RAO DIVAKONDA
Publisher

Date: March 1, 2024